జెడ్పీ స్థాయి సంఘ సమావేశాల్లో వివిధ అంశాలపై చర్చ



విశాఖపట్నం, జననేత న్యూస్:
విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన 1 నుండి 7వ స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. సభ్యులు లేవనెత్తిన పలు ప్రజా సమస్యలపై అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని సుభద్ర ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాలలో కూలీలకు తప్పనిసరిగా నీడ (షెడ్లు), తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. జనకాపల్లి జిల్లా పరిధిలోని ప్లాంటేషన్లలో చనిపోయిన 10 రకాల మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటాలని సూచించారు. కొండ ప్రాంతాలు, ఏజెన్సీ పరిధిలో ఉపాధి పనులను వేగవంతం చేయడంతోపాటు చెక్ డ్యామ్‌ల నిర్మాణం, వాటర్ షెడ్ నిధుల సద్వినియోగంపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. దేవరపల్లి, కోటవురట్ల తదితర మండలాల్లో కాలువల పూడికతీత, రైవాడ ఆయకట్టు నీటి సరఫరా, జలధార పథకం పనుల పురోగతిని వేగవంతం చేయాలని అధికారులను కోరారు. డిఆర్డిఎ అధ్వర్యంలో కూరగాయల సాగు, స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి సబ్సిడీలు, బ్యాంక్ లింకేజీ రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని స్పష్టం చేశారు.
జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే విద్యుత్ సరఫరా, తాగునీటి కనెక్షన్లు కల్పించాలని, నిలిచిపోయిన బిల్లులను విడుదల చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల అప్గ్రేడేషన్, ప్లే గ్రౌండ్ల ఏర్పాటు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. అరకు, పాడేరు ప్రాంతాలలో ఉద్యోగులు ఆక్రమించుకున్న బీసీ హాస్టల్ భవనాలను తక్షణమే ఖాళీ చేయించి విద్యార్థుల వసతికి కేటాయించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల అధికారులు, జెడ్పిటీసీ సభ్యులు, జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.